క్లుప్తంగా

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్టు సభ్యులు శుక్రవారం ప్రేమ సమాజంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. శ్రీనివాసరావు వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కనకల రఘురామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కొండలరావు, పుష్పకుమార్‌రెడ్డి, ప్రసాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ స్టార్ కృష్ణ జయంతి



వృద్ధులకు అల్పాహారం వడ్డిస్తున్న సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు

విజయనగరం: సినీనటుడు, పద్మ భూషణ్ డాక్టర్ ఘట్టమనేని కృష్ణ 81వ జయంతిని ఆయన అభిమానులు పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫైర్ ఆఫీస్ దగ్గర ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో నిరాశ్రయులు, వృద్ధుల సమక్షంలో కేక్ కట్‌చేశారు. అనంతరం వృద్ధులకు అల్పాహారం, పండ్లు, బిస్కెట్లు, కేకులు పంపిణీ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్, సుధీర్‌బాబు కల్చరల్ అసోసియేషన్ జిల్లా అభిమాన సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అభిమానులు డి.హుస్సేన్, ఆర్.వి.రమణరాజు, డి.రాంబాబు, బోణీ అప్పారావు, నారాయణరావు, శేఖర్, ఎ.విజయ్, ఎం.రమేష్, సాంబరాజు, కామేష్, రాజేష్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొంగలొస్తున్నారు.. జాగ్రత్త!



భోగాపురం సర్కిల్ ఎస్‌హెచ్‌ఓ రవికుమార్

భోగాపురం: వేసవికాలంలో రాత్రివేళ గ్రామీణ ప్రజలు ఆరుబయట, ఇంటి మేడపైన నిద్రిస్తున్నారని, ఇదే అవకాశంగా తీసుకుని దొంగలు ఇళ్లలోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుపోతున్నారని, మండల వాసులందరూ అప్రమత్తం కావాలని ఎస్‌హెచ్‌ఓ ఎ.రవికుమార్ శుక్రవారం ఒక ప్రటనలో కోరారు. రాత్రిపూట ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే వెంటనే డయల్ 100కిగాని, భోగాపురం పోలీస్‌స్టేషన్ నంబర్ 91548 79651, 91211 09445కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఆపన్నహస్తం



యువతి తల్లికి నగదు అందజేస్తున్న పారసాం గ్రామస్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులు ఆపన్నహస్తం అందించారు. గుర్ల మండలంలోని భూపాలపురం గ్రామానికి చెందిన నిరుపేద యువతి వెంకటలక్ష్మి ఇటీవల జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. చికిత్సకు పెద్ద మొత్తంలో డబ్బులు అవసరం కావడంతో కుటుంబ సభ్యులు దాతల సహకారాన్ని కోరారు. ఈ నేపథ్యంలో స్పందించిన ఉపాధి హామీ వేతనదారులు తమవంతుగా రూ.33 వేలు సేకరించి శుక్రవారం యువతి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి స్నపన తిరుమంజనం

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో వైశాఖ మాసాన్ని పురస్కరించుకుని శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవిప్రసాద్ మంత్రోచ్ఛరణలతో మూలవిరాట్లకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యఅభిషేకం, నక్షత్రహారతి, పట్టువస్త్రాలంకరణ, దీప, కర్పూర హారతితో అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

బొండపల్లి: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలోని కొత్త కాలనీతో పాటు, కోవ్వాడపేట, దేవుపల్లిలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సీతారామ కల్యాణం వైభవంగా చేపట్టనున్నారు.

వీధి కుక్కల నియంత్రణకు...

ఆపరేషన్ ఏబీసీ

- నగరంలో కుక్కల నియంత్రణకు కార్పొరేషన్ చర్యలు
- కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు
- ఇప్పటివరకు 979 మగ కుక్కలు, 844 ఆడ కుక్కలకు ఆపరేషన్లు
- ఒక్కో కుక్కకు రూ.1500 చొప్పున ఖర్చు చేస్తోన్న కార్పొరేషన్ యంత్రాంగం



యాంటీ బర్త్ కంట్రోల్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేసేందుకు వీధి కుక్కలను పట్టుకుని వ్యాన్‌లో ఎక్కిస్తున్న సిబ్బంది



కుక్కకు చికిత్స చేస్తోన్న వైద్యుడు

విజయనగరం: ఇటీవల కాలంలో వీధి కుక్కల దాడులు అధికమయ్యాయి. గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు మానవాళిపై దాడిచేసి ప్రాణాలను సైతం కబళిస్తున్న ఘటన ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలో చోటు చేసుకుంది. దీంతో ప్రజలు రోడ్లపై సంచరించేందుకు భయపడాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపడుతోంది. వాటికి యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్(ఏబీసీ) చేయించడంతో పాటు, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేస్తోంది. భవిష్యత్‌లో కుక్కల సంఖ్యను తగ్గించడంతో పాటు ఊర కుక్కలు కరిచినా ఎటువంటి ప్రమాదం సంభవించకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది.

ఒక్కో చికిత్సకు రూ.1500 ఖర్చు

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లు ఉండగా... ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని వాటిని అవసరమైన చికిత్సలు జోరుగా సాగుతున్నాయి. దీనికోసం హర్యానాకు చెందిన స్నేహ వెల్ఫేర్ సొసైటీతో కార్పొరేషన్ యంత్రాంగం ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్కో కుక్కకు చికిత్స చేసేందుకు రూ.1500 చొప్పున ఖర్చు చేస్తోంది. ఆయా ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను కొత్తపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రానికి ముందుగా తరలిస్తోంది. అక్కడ రెండు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచిన తరువాత యాంటీ బర్త్ కంట్రోల్ ఆపరేషన్ చేస్తారు. అదే సమయంలో యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తారు. ఆపరేషన్ అనంతరం 3 రోజులు అబ్జర్వేషన్‌లో ఉంచి.. కుక్కలు పూర్తిగా కోలుకున్నాక ఎక్కడ నుంచి తీసుకువచ్చారో అక్కడ విడిచిపెడతారు.

ఇప్పటి వరకు 979 మగ, 844 ఆడ కుక్కలకు చికిత్స

విజయనగరంలో చేపడుతున్న వీధి కుక్కల నియంత్రణ చర్యలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి నియంత్రణ చర్యలు ప్రారంభించగా... అధికారిక లెక్కల ప్రకారం 979 మగ కుక్కలకు, 844 ఆడ కుక్కలకు యాంటీ బర్త్ కంట్రోల్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేశారు. నగరంలోని 50 డివిజన్లలో సంచరిస్తున్న కుక్కలను గుర్తించి వాటన్నింటికీ చికిత్సలు చేయనున్నారు.

చికిత్సల పర్యవేక్షణకు ప్రత్యేక బృందం

నగరంలో చేపడుతున్న వీధి కుక్కల నియంత్రణ చర్యలు సక్రమంగా జరుగుతున్నదీ... లేనిది పరిశీలించేందుకు ప్రత్యేక బృందం పర్యవేక్షిస్తోంది. కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు ప్రజారోగ్య అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారులు, ఒక స్వచ్ఛంద సంస్థ సభ్యులు కుక్కలకు జరుగుతున్న చికిత్సలు, వాటి ఆరోగ్య స్థితిగతులపై నిత్య పర్యవేక్షణ చేస్తున్నాయి.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



నగరంలో వీధి కుక్కల నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. దీనికోసం ఓ స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాం. వారే కుక్కల్ని పట్టుకుని తీసుకువచ్చి యాంటీ బర్త్ కంట్రోల్, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు వేయించిన అనంతరం తిరిగి ఆయా ప్రాంతాల్లో విడిచి పెడతారు. ఈ ప్రక్రియ నగరంలో క్రమం తప్పకుండా చేపడుతున్నాం. తద్వారా కుక్కల వ్యాప్తిని తగ్గించి భవిష్యత్‌లో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.మల్లయ్యనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

పట్టుదల, ఆత్మవిశ్వాసంతోనే లక్ష్య సాధన



మాట్లాడుతున్న సత్య విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు

విజయనగరం అర్బన్: లక్ష్య సాధనకు పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరమని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అన్నారు. ఎంఆర్ కళాశాల వసతి గృహంలో గతనెల 28వ తేదీ నుంచి ఈనెల 7వ తేదీ వరకు జరిగే ఏటీసీ 4 ఎన్‌సీసీ క్యాంపును శుక్రవారం సందర్శించారు. వక్తిత్వ వికాసం, జాతీయ సమైక్యతాభావన అంశాలపై ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి విద్యతో పాటు నైతిక విలువలు అలవర్చుకోవాలన్నారు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ఉన్నపుడే లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్, విశాఖ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నీరజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుబేదార్ రవీంద్ర సింగ్, సుబేదార్ సుజన్ సింగ్, సుబేదార్ సునీల్ సింగ్, కెప్టెన్ డి.జగదీశ్వరరావు, లెఫ్టినెంట్ ఎ.ఎస్.మూర్తి, చీఫ్ ఆఫీసర్లు లత, నాయుడు, సెకెండ్ ఆఫీసర్ ప్రసన్న, థర్డ్ ఆఫీసర్ రామ్మోహన్, కెప్టెన్ కళ్యాణ్ అశోక్ కుమార్, ఉదయ్‌కిరణ్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి



హనుమాన్ జయంతి గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న టీటీడీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్

విజయనగరం టౌన్: టీటీడీ, హిందు ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని టీటీడీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ జె.శ్యామ్‌సుందర్ తెలిపారు. టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో శుక్రవారం గోడ పత్రికలను ఆవిష్కరించారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కొలువైన అభయాంజనేయ స్వామికి హనుమాన్ జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీకే గాయత్రీ శర్మ ఆధ్వర్యంలో సీతారామకళ్యాణోత్సవం జరిపారు.

అల్లర్లకు పాల్పడేవారిపై చర్యలు

- సీఐ వెంకటేశ్వరరావు



రెల్లివలసలో అవగాహన కల్పిస్తున్న సీఐ వేంకటేశ్వరరావు, తదితరులు

పూసపాటిరేగ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 6వ తేదీవరకు అన్ని గ్రామాల్లోనూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అల్లర్లు సృష్టించేవారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ బి.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని రెల్లివలస గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు చేసినా, బాణసంచా కాల్చినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం



పొగాకు ఉత్పత్తులు వాడొద్దంటూ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న క్లబ్ ప్రతినిధులు

విజయనగరం: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని, వాటికి దూరంగా ఉండాలని శ్రీ సాయి కృష్ణా వాకర్స్ క్లబ్ సభ్యులు పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం అయ్యన్నపేట కూడలిలో పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్–102 మాజీ గవర్నర్ డాక్టర్ ఎ.ఎస్.ప్రకాశరావు, క్లబ్ గౌరవ సలహాదారుడు ఎ.తిరుపతిరావు, క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ, కార్యదర్శి ఐ.వి.ప్రసాదరావు, కోశాధికారి ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడు వల్లూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగాన్ని నియంత్రించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ రాణి

విజయనగరం ఫోర్ట్: గ్రామాల్లో పొగాకు వినియోగాన్ని నియంత్రించాలని అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాణి వైద్యసిబ్బందికి పిలుపునిచ్చారు. అదనపు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డెమో చిన్నతల్లి, బి.మహాలక్ష్మి, సాయిరమణి పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



రమణమ్మ దంపతులను సత్కరిస్తున్న బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ సామ్యూల్‌జాన్

డెంకాడ: ఉద్యోగ జీవితంలో చేసిన సేవలే గుర్తింపును, గౌరవాన్ని తెస్తాయని బెటాలియన్ ఇన్‌చార్జి కమాండెంట్ పి.సామ్యూల్ జాన్ అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన జూనియర్ అసిస్టెంట్ పి.రమణమ్మ దంపతులను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఉద్యోగ జీవితంలో రమణమ్మ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, మినిస్టీరియల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

36 వాహనాలు సీజ్



కార్డన్ సెర్చ్‌లో భాగంగా సీజ్‌చేసిన వాహనాలు

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస గ్రామంలో కార్డన్‌సెర్చ్ కార్యక్రమంలో భాగంగా 36 వాహనాలను శుక్రవారం సీజ్ చేసినట్లు భోగాపురం సీఐ వెంకటేశ్వర్రావు తెలిపారు. లైసెన్స్, అనుమతిపత్రాలు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశామన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పూసపాటిరేగ, నెల్లిమర్ల ఎస్సైలు ఎ.సన్యాసినాయుడు, రామగణేష్ పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

వేపాడ: మండలంలోని బొద్దాం సమీపంలో వడదెబ్బకు గురై వ్యక్తి మృతి చెందాడు. వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలం గొల్జాం గ్రామానికి చెందిన తూర్పాటి సూర్యనారాయణ(36) శుక్రవారం మేస్త్రీ పనికి బొద్దాం వెళ్తుండగా వడదెబ్బకు గురై కళ్లు తిరిగి పడిపోయాడు. అక్కడ సాయంచేసేవారు లేకపోవడంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు అంటున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు.

నిప్పుల కుంపటి

- ఉష్ణతాపంతో అల్లాడుతున్న జనం
- వడగాడ్పులతో ఆపసోపాలు
- చల్లబడితేగాని బయటకు రాలేని పరిస్థితి



నిర్మానుష్యంగా ఉన్న వెంపడాం రహదారి



పేరాపురం రోడ్డు ఇలా...

పూసపాటిరేగ: భానుడు ఉగ్రరూపానికి ప్రజలు విలవిల్లాడుతున్నారు. వడగాడ్పులకు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. శుక్రవారం 41 నుంచి 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 4 గంటల వరకు దాదాపు రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పేరాపురం– వెంపడాం రోడ్డు ఉదయం 10 గంటలకే నిర్మానుష్యమైంది. ఉదయం 11 గంటలకే దుకాణాలన్నీ మూతపడుతున్నాయి. ఇళ్లపై వాటర్ ట్యాంకులలో నీరు వేడెక్కుతోంది. రోహిణీ కార్తెలో భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు.

పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సత్కరిస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, తదితరులు

విజయనగరం క్రైమ్: సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో క్రమశిక్షణతో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వన్‌టౌన్ ఏఎస్‌ఐ పుప్పాల సత్యనారాయణ, ఏఆర్ హెచ్‌సీ ఇనకోటి నరసింగరావు, టి.పాపారావును జిల్లా పోలీస్ శాఖ ఘనంగా సత్కరించింది. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో వారి సేవలను జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ కొన్నియాడారు. నిస్వార్థంగా సేవలందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. విధి నిర్వహణలో వారు చూపిన క్రమశిక్షణ, అంకిత భావమే వారిని పోలీస్ శాఖలో ఉన్నతంగా నిలిపిందన్నారు. ఈ సందర్భంగా వారిని దుశ్శాలువ, పూలమాలలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎం.ఎం.సాల్మన్, డీఎస్పీ యూనివర్స్, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, ఆర్‌ఐలు గోపాలనాయుడు, రమేష్‌కుమార్, ఆర్‌ఎస్‌ఐలు సూర్యనారాయణ, తిరుపతిరావు, గోపాలరావు, మహేష్ పాల్గొన్నారు.

ధూమపానానికి దూరంగా ఉండండి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి ప్రమీలాదేవి, తదితరులు

పూసపాటిరేగ: ధూమపానానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పూసపాటిరేగ పీహెచ్‌సీ వైద్యురాలు ప్రమీలాదేవి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పొగ తాగేవారి కంటే పీల్చే వారిపై 80 శాతం ప్రభావం పడుతుందన్నారు. బహిరంగ ప్రదేశంలో పొగతాగడం నిషేధమన్నారు. పొగతాగేవారు ఊపిరితిత్తుల వ్యాధుల భారిన పడుతారని చెప్పారు. ఆరోగ్యంగా జీవించేందుకు ధూమపానానికి దూరంగా ఉండాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజేష్‌వర్మ, ఆయుష్ వైద్యాధికారి లక్ష్మీశైలజ, వైద్య సిబ్బంది మహేశ్వరి, ఉమాపతి, ఆర్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

పంటల నిల్వకు ప్రత్యేక గోదాం

- రూ.40 లక్షలతో నిర్మాణం
- 500 మెట్రిక్ టన్నుల వరకు నిల్వ



రామలింగాపురం వద్ద రూ.40 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాం

చీపురుపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన అన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్ర పరికరాలను ఆర్‌బీకేల ద్వారా రాయితీపై అందిస్తోంది. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోతే వాటిని నిల్వ చేసుకునేందుకు గోదాంలు, కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మండలంలోని రామలింగాపురం గ్రామంలో బహుళ ప్రయోజన సౌకర్య గోదాంను ప్రభుత్వం నిర్మించింది. గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. రామలింగాపురం పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ఈ గోదాం ఎంతో ప్రయోజనకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు ఈ గోదాంలో పంటలను నిల్వ చేసుకోవచ్చు. అంతేకాకుండా వర్షాలకు పంట తడిచిపోకుండా తాత్కాలికంగా ఈ బహుళ ప్రయోజన సౌకర్య గోదాంలో నిల్వ చేసుకునే సదు పాయం కూడా ఉంది. రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చే ఈ గోదాంను ప్రభుత్వం కొద్ది నెలలు కిందటే అందుబాటులోకి తీసుకొచ్చింది.

ముగిసిన ధనుర్విద్య శిక్షణ



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు, తదితరులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక సమీపంలోని ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న ధనుర్విద్య శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు 25 మందికి స్వామి వారి శేషవస్త్రం, ప్రసాదం, ప్రశంసా పత్రం సమర్పించారు. కార్యక్రమంలో విభావరి తివారీ, ఎన్‌సీఎస్ ట్రస్టీలు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి, నిత్య, సత్యనారాయణ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.